www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక


శనివారం
26.09.2026



- అంగరంగ వైభవంగా శోభాయాత్ర
- బొజ్జ గణపయ్యకు భక్తుల వీడ్కోలు
- హుస్సేన్‌సాగర్ తీరంలో భక్తజనం
- సూపర్ క్రేన్ సాయంతో సాఫీగా నిమజ్జనం
- పకడ్బందీ బందోబస్తుతో ముగిసిన మహా ఘట్టం!

2లో..

నగరవాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించిన ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి నిమజ్జన మహోత్సవం హుస్సేన్‌సాగర్‌లో అశేష భక్తజన సందోహం నడుమ అత్యంత వైభవంగా ముగిసింది. విజయవాడ నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక భారీ టస్కర్ వాహనంపై 69 అడుగుల భారీ విగ్రహాన్ని నగర పురవీధుల మీదుగా ఊరేగించి, ప్రత్యేక సూపర్ క్రేన్ సాయంతో సాగర్‌లో నిమజ్జనం చేశారు. భక్తుల జయజయధ్వానాలు, 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో ట్యాంక్ బండ్ పరిసరాలు మార్మోగగా, పోలీసుల పటిష్ట బందోబస్తు, అధికారుల సమన్వయంతో మహా ఘట్టం ప్రశాంతంగా పూర్తయింది.



3లో

దోమల దండయాత్ర..

చిల్లులపై కుట్లు!

"పల్లెల్లో డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు పంజా విసురుతుంటే, ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన వైద్యారోగ్య శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విషజ్వరాల నివారణకు దోమల మందు పిచికారీ చేసే బ్రీడింగ్ చెక్కర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఆదేశించినా అధికారులు బుట్టదాఖలు చేశారు. క్షేత్రస్థాయిలో స్ప్రేయింగ్ పనులు నిలిపివేసి, నకిలీ కాగితాలతో నిధులు దారిమళ్లించేందుకు పక్కా స్కెచ్ వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ దొంగ బిల్లులకు రూట్ వేస్తున్న అధికారుల తీరుపై సర్వత్రా తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కలంజ్యోతి, చెన్నారావుపేట

- బ్రీడింగ్ చెక్కర్లకు ఉద్వాసన..
- పల్లెల్లో దోమల స్వైరవిహారం!
- కలెక్టర్ ఆదేశాలు సైతం బుట్టకేనా?
- డిప్యూటేషన్ చక్రం వెనుక కాసుల కక్కుర్తి!
- క్షేత్రంలో లేని పనులు.. ఖాతాల్లోకి అక్రమ నిధులు!
- ప్రజారోగ్యం గాలికి.. నిధులు అధికారుల జేబులకి!
- ప్రజల్లో విషజ్వరాల భయం.. అధికారుల నిర్లక్ష్యం!

3లో..

గంగమ్మ ఒడికి గణపయ్య

ముగిసిన బడా గణేశ్ నిమజ్జనం





కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శనివారం 26.09.2026
2
www.kalamjyothi.com



గంగమ్మ ఒడికి గణపయ్య

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 25) : హైదరాబాద్ మహానగరంలో అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగిన ప్రసిద్ధ ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి నిమజ్జనోత్సవం అశేష భక్తజన సమక్షంలో ప్రశాంతంగా ముగిసింది. విజయవాడ నుంచి తీసుకొచ్చిన భారీ టస్కర్ వాహనంపై 69 అడుగుల భారీ గణనాథుడి శోభాయాత్ర ఖైరతాబాద్ నుంచి ప్రారంభమై సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, సెక్రటేరియట్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్ వైపు సాగింది. ఉదయం క్రేన్‌లో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక లోపం వల్ల ప్రారంభంలో కొంత జాప్యం జరిగినప్పటికీ, అధికారుల సమన్వయంతో విగ్రహం సకాలంలోనే హుస్సేన్‌సాగర్ తీరానికి చేరుకుంది. దారి పొడవునా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందగా, స్థానికులు ఇళ్లు, భవనాలపైకి ఎక్కి శోభాయాత్రను ఎంతో ఆసక్తిగా తిలకించారు.

ట్యాంక్ బండ్‌పై కోలాహలం!

రాష్ట్రంలోనే అతిపెద్ద గణనాథుడిని నిమజ్జనం చేసేందుకు అధికారులు ప్రత్యేకంగా తీసుకొచ్చిన సూపర్ క్రేన్ సహాయంతో నిమజ్జన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. గత ఐదేళ్లుగా ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న ఈ భారీ క్రేన్‌కు ముందస్తుగా అన్ని భద్రతా పరీక్షలు నిర్వహించి ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద సిద్ధం చేశారు. గణనాథుల నిమజ్జనానికి ఆఖరి రోజు కావడంతో ట్యాంక్ బండ్ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఖైరతాబాద్, బాలాపూర్ సహా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలు తరలిరావడంతో హుస్సేన్ సాగర్ పరిసరాలు, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్, సచివాలయం మార్గాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి.

భావోద్వేగ వీడ్కోలు..

భక్తుల జయజయధ్వానాలు, 'గణపతి బప్పా మోరియా' నినాదాల నడుమ మహాగణపతికి అశేష భక్తజనం భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. బడా గణేషుడిని కడసారి దర్శించుకునేందుకు తరలివచ్చిన వేలాది భక్తులతో సాగర్ తీరం జనసంద్రంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖల సమన్వయంతో పకడ్బందీ బందోబస్తు నడుమ నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశారు. ఉత్సవ కమిటీ, అధికారులు అనుకున్న సమయానికే శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

బాలాపూర్ లడ్డూ సరికొత్త రికార్డు!

- రూ.39 లక్షలు పలికిన గణనాథుడి ప్రసాదం!
- దక్కించుకున్న అర్బన్ గ్రూప్ ఛైర్మన్ సామ ప్రణీత్ రెడ్డి!
- గతేడాది కంటే నాలుగు లక్షలు అధికం!

కలంజ్యోతి, బడంగ్‌పేట్ (సెప్టెంబర్ 25) : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణనాథుడి లడ్డూ వేలం పాటలో సరికొత్త రికార్డు నమోదైంది. శుక్రవారం పోటాపోటీగా సాగిన వేలం పాటలో సాహెబ్‌నగర్‌కు చెందిన అర్బన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఛైర్మన్ సామ ప్రణీత్ రెడ్డి రికార్డు స్థాయిలో రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది 2025లో లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు లడ్డూను దక్కించుకోగా, ఈసారి అంతకంటే నాలుగు లక్షల రూపాయలు అధికంగా పలకడం విశేషం. ఉత్కంఠభరితంగా సాగిన వేలం పాట ముగిసిన అనంతరం భారీ పోలీస్ బందోబస్తు నడుమ బాలాపూర్ గణనాథుడి శోభాయాత్ర నిమజ్జనం వైపు కదిలింది.



రూ.450తో మొదలై.. రూ.39 లక్షల ఖ్యాతికి!

బాలాపూర్ గణనాథుడి లడ్డూను దక్కించుకుంటే అదృష్టం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల్లో ప్రగాఢ విశ్వాసం ఉంది. ఈ నమ్మకమే ఏటేటా వేలం పాటలో తీవ్ర పోటీకి దారితీస్తోంది. 1994లో కేవలం రూ.450తో ప్రారంభమైన ఈ లడ్డూ వేలం ప్రక్రియ, నేడు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు సాధించింది. ప్రారంభమైన నాటి నుంచి తన పాత రికార్డులను తానే అధిగమిస్తూ బాలాపూర్ గణనాథుడు ముందుకు సాగుతుండటంతో, లడ్డూ అంటే బాలాపూర్.. బాలాపూర్ అంటే లడ్డూ అనే స్థాయిలో ఈ ప్రసాదానికి విశిష్టమైన ఖ్యాతి లభించింది.



కోటి పలికిన గణేశ్ లడ్డూ!

- రూ.1.01 కోట్లు దక్కించుకున్న శక్తిమాన్ బృందం!
- కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో వేలం రికార్డు!
- లడ్డూ పాట ముగియగానే నిమజ్జనానికి తరలింపు!

కలంజ్యోతి, బండ్లగూడజాగీర్ (సెప్టెంబర్ 23) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్ మండ్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్‌లోని వినాయక మండపంలో గణనాథుడి లడ్డూ వేలం పాట మరోసారి రికార్డు సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్కంఠభరితంగా నిర్వహించిన ఈ వేలంలో అదే కమ్యూనిటీకి చెందిన శక్తిమాన్ బృంద సభ్యులు పోటాపోటీగా పాల్గొని ఏకంగా రూ.1.01 కోట్లకు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు.

నాలుగేళ్లుగా రికార్డు ధరలు..

2016లో ఇక్కడ మొదటిసారిగా లడ్డూ వేలం ప్రక్రియ ప్రారంభమైంది. ఆ తర్వాత గత నాలుగేళ్లుగా ఈ గేటెడ్ కమ్యూనిటీకి సంబంధించిన లడ్డూ వేలం తెలుగు రాష్ట్రాల్లోనే రికార్డు స్థాయిలో కొనసాగుతుండగా, ఈ ఏడాది కూడా అదే పరంపరను కొనసాగించారు. గత ఏడాది ఈ కమ్యూనిటీలో లడ్డూ అత్యధికంగా రూ.2.31 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ప్రతి సంవత్సరం కమ్యూనిటీకి చెందిన నివాసితులంతా నాలుగు గ్రూపులుగా విడిపోయి లడ్డూను దక్కించుకునేందుకు వేలం పాటలో తీవ్రంగా పోటీపడుతుంటారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం..

పోటాపోటీగా సాగిన లడ్డూ వేలం పాట ముగిసిన అనంతరం వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. ఈ వేలం పాట, నిమజ్జనోత్సవ కార్యక్రమంలో కమ్యూనిటీకి చెందిన మహిళలు, పిల్లలు, యువకులు, పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

శనివారం 26.09.2026

www.kalamjyothi.com



త్వరలోనే అదనపు గదులు నిర్మిస్తాం

సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్

పాఠశాలలో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ ఆకస్మికంగా సందర్శించి మౌలిక వసతులు, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లిన సర్పంచ్ విద్యార్థులతో పుస్తకాలు చదివించి, పాఠ్యాంశాలపై వారికున్న అవగాహనను పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. బడిలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచుతూ, బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు సురేందర్, సత్య, పూర్ణిమల పనితీరును సర్పంచ్ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అదనపు గదుల భవన నిర్మాణం అవసరమని ఉపాధ్యాయులు కోరగా, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 25) : హత్నూర మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామం 6వ వార్డులో బజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. 12 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణపతిని భక్తులు, యువకులు ఆటపాటలతో ఊరేగించారు. బొజ్జ గణపయ్య పిల్లాపాపలను సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆ స్వామివారిని వేడుకున్నామని, ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు చేపట్టి ఘనంగా నిమజ్జనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదుల నగర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు మనరిగారి వీరేశం, గ్రామపంచాయతీ సభ్యులు బోయిని మనోహర్, గ్రామస్తులు వనరిగారి ప్రభు, వనరిగారి నర్సింలు, వనరిగారి రమేష్, శ్రీశైలం, రాఘవేందర్, బజరంగ్ దళ్ యూత్ నాయకులు వనరిగారి అనిల్, వనరిగారి శ్రీకాంత్, వనరిగారి కేశవులు, వనరిగారి నవీన్, వనరిగారి అంకుష్, వనరిగారి చింటూ, వనరిగారి సునీల్, వనరిగారి మహేష్, వనరిగారి బబ్బులు, కుమ్మరి సత్తి, యువకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.





దోమల దండయాత్ర.. చిల్లులపై కుట్ర!


కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : ఒకవైపు డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు పల్లెలను భయపెడుతుంటే, మరోవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి ఏటా గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి, నివారణ మందులు చల్లే బ్రీడింగ్ చెక్కర్స్ నియామకంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం వెనుక లక్షల రూపాయల నిధుల మళ్లింపు కుట్ర ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్ ఆర్డర్ ఇచ్చినా కదలని వైనం!

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులోనే బ్రీడింగ్ చెక్కర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. సరిపోకపోతే, ఆగస్టు 17న నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సత్య శారదను కార్మికులు కలవగా, వెంటనే 15 మందిని (పాతవారితో పాటు అదనంగా మరో ఐదుగురిని) విధుల్లోకి తీసుకోవాలని డీఎంహెచ్ఓకు స్పష్టమైన ఆర్డర్ వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్మికులు సెప్టెంబర్ 17న తమ బయోడేటాలను ఆఫీసులో సమర్పించారు. కానీ, వారం గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదు.

ఏడేళ్లుగా కాపాడుతున్నా.. ఎందుకీ ఉద్వాసన?

గత ఏడు సంవత్సరాలుగా ప్రతి ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఐదు నెలల పాటు వీరు పల్లెల్లో స్ప్రేయింగ్ పనులు చేస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. అయితే, ఈ ఏడాది వారిని


APPLICATION FORM

To DMHO office

Sir

SUB : Application for the post of ... Working Charker

Being given to under stand that there are some of above vacancies under your kind control and as such I Submit this application for favour of consideration for the above Posts

I submit here under my detailed biographical particulars for favour of your kind personal and consideration.

BIO - DATA

1.	Name in full	Bhukya Srinivas
2.	Father's Name	Bhukya Lingam
3.	Age and Date of Birth	33 yrs (05-08-1989)
4.	Caste and Religion	ST (Lambadi) / Naik
5.	Native Place	Narsimhulapalli
6.	Educational qualifications	SSC Unmarried
a)	Academic	Inter (2016) Hindi
b)	Technical	
7.	Experience	7 Yrs (Spraying Checker)
		Khanapur - 2yrs
		Nallabelly - 2yrs
		Chennaraopet - 2yrs
		Khanapur - 2yrs
8.	Employmetn Registration No.	At Bhukyathanda
9.	Address 1) Permanent	Mdl Chennaraopet, Mandampalli
	2) Temporary/Correspondence	At: Warangal, 506172
10.	Extra-Curricular activities	Telugu
11.	Language Known	Lambadi
12.	Nationality	
13.	Any other information	

In view of the above, I request you to kindly ... serve you Esteemed organisation in the capacity mentioned above ... I shall be very thankful to you.

17 SEP 2026 Warangal District

Thank you Sir,

Yours faithfully

Place : Warangal (DMHO)

విధుల్లోకి తీసుకోకపోవడం వెనుక పెద్ద కథే నడుస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

నకిలీ పేపర్లు.. బంధువుల అకౌంట్లలోకి నిధులు!

గత ఏడాది కూడా బ్రీడింగ్ చెక్కర్లను విధుల్లోకి తీసుకోకుండానే, వారు పనిచేసినట్లు నకిలీ పేపర్లు సృష్టించి తమ బంధువుల అకౌంట్లలోకి నిధులను మళ్లించారనే ప్రచారం బాహాటంగానే జరుగుతోంది. సంగెం పీహెచ్‌సీ నుంచి డీఎంహెచ్ఓ ఆఫీస్‌కు డిప్యూటేషన్‌పై వచ్చిన ఒక హెల్త్ అసిస్టెంట్ ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతూ, ఈ సారి కూడా అదే రీతిలో నిధులు కాజేయడానికి స్కెచ్ వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మా పాట్ట కొట్టొద్దు.. గ్రామాలను కాపాడండి!

అధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ జీవితాలతో ఆడుకుంటున్నారని బ్రీడింగ్ చెక్కర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే తమను విధుల్లోకి తీసుకుని గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు పునరుద్ధరించాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్ నాయక్, నాయకులు బాదావత్ రామ్ చందర్, జన్ను సరిత, చిన్నపెల్లి దేవేందర్, మంత్రి చానిక్య, బాదావత్ బద్రు, రాజేశ్వర్ రావు, రామ్ కుమార్, చిర్ర రాజు, మోహన్ రావులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు

పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటాం సర్పంచ్ చొప్పరి భూమయ్య

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : రామాజీపేట యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున శుక్రవారం ఉచిత యూనిఫాం దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సాయం చేయడంలో ముందుంటూ పాలకవర్గం తమ ఔదార్యాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ చొప్పరి భూమయ్య మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన ప్రతి విషయంలో గ్రామపంచాయతీ అండగా ఉంటుందని తెలిపారు. ఉప సర్పంచ్ బసవరాజు జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వార్డు సభ్యులు ఆంజనేయులు, అక్షత మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం అభినందనీయమని, విద్యార్థుల క్రమశిక్షణతో పాటు ఉపాధ్యాయుల బోధన బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రవి, సాగర్, మౌనిక, లలిత, అలేఖ్య, గ్రామ కార్యదర్శి సందీప్, ఉపాధ్యాయులు సంపత్, నిర్మల, ఊర్మిళ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇదే క్రమంలో మండల స్థాయిలో ఉత్తమ గణిత ఉపాధ్యాయుడిగా ఎంపికైన ప్రధానోపాధ్యాయులు బి. సుధాకర్ శర్మను గ్రామపంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించగా, అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు పాలకవర్గాన్ని పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు సుధాకర్ శర్మ సన్మానించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
శనివారం 26.09.2026
www.kalamjyothi.com





శోభాయాత్రకు భారీ భద్రత

యాత్ర ప్రారంభించిన ఏలేటి

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 25) : నిర్మల్ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శోభాయాత్రను బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు ఎస్పీ డా. జి. జానకి షర్మిల పర్యవేక్షణలో 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక అదనపు ఎస్పీ, ఒక ఏఎస్పీ, 15 మంది డీఎస్పీల ఆధ్వర్యంలో భద్రత కొనసాగింది. 106 సీసీ కెమెరాలు, 4 డ్రోన్లతో నిరంతర నిఘా ఉంచారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించిన ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, మసీదులు, నిమజ్జన ప్రాంతాల వద్ద శోభాయాత్రను 8 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక బృందాలను, అవసరమైన చోట్ల లిఫ్టింగ్ అండ్ పుషింగ్ పార్టీలను అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ఖైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.





ప్రభుత్వ ప్రసవాలు పెంచాలి

డీఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంస్థాగత ప్రసవాల శాతాన్ని పెంచేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. ఇల్లంతకుంట పీహెచ్సీలో వైద్య సేవలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, తల్లిశిశు సంరక్షణ సేవలు, అసాంక్రమిక వ్యాధుల నియంత్రణ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. గర్భిణులను ముందుగానే గుర్తించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయాలని, సర్కారు దవాఖానాల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు దిశానిర్దేశం చేశారు. టీకాల కార్యక్రమాన్ని వంద శాతం లక్ష్యంతో అమలు చేయాలని, మధుమేహం, రక్తపోటు బాధితులకు క్రమం తప్పకుండా ఫాలోఅప్ చికిత్స అందించాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు సర్కారు సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా. సంపత్ కుమార్, డా. రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డా. జీవన జ్యోతి, ఆశా నోడల్ అధికారి శాంత, పీహెచ్ఎన్ పూల, ఎన్హెచ్ఎం డీడీఎం కార్తీక్, పీహెచ్సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల వికాసానికి సమగ్ర ప్రణాళిక



ఎంపీడీఓ వెంకట శివానంద్

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : చెన్నారావుపేట మండల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం కీలక నిర్ణయాలతో సాగింది. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, పీఏసీఎస్ చైర్మన్ల పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో 17 మంది అధికారులు, 15 మంది సర్పంచ్లు పాల్గొన్నారు. గత 45 రోజుల్లో చేపట్టిన పారిశుధ్య పనులు, ఉపాధి హామీ పథకం, మౌలిక వసతుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. రానున్న రోజుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. తాగునీరు, గ్రామీణ రహదారుల సమస్యలను సర్పంచ్లు సభ దృష్టికి తీసుకురాగా, ఎంపీడీఓ వెంకట శివా నంద్ స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సమావేశం నిర్ణయించింది. చెన్నారావుపేటను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.





చేయూత దరఖాస్తుల పరిశీలన

అర్హుల వివరాలను
పారదర్శకంగా నమోదు చేస్తాం
ఏపీఎం కుమారస్వామి

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తులను అధికారులు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీఎం కుమారస్వామి స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి, అర్హత సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను పారదర్శకంగా పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేస్తామని ఏపీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి రచన వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు ఎలుక రామస్వామి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి, సీసీ విట్టల్ రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : లక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ యూనియన్ ఇల్లంతకుంట నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా గంగం అనిల్, ఉపాధ్యక్షుడిగా దయ్యాల మహేష్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రమేష్, క్యాషియర్గా దుశేటి లింగం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ను మరింత బలోపేతం చేసేందుకు సభ్యుల సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
శనివారం 26.09.2026
www.kalamjyothi.com

మోడల్ స్కూల్‌లో ఇన్నోవేషన్ కౌన్సిల్

నూతన ఆలోచనలతో ముందుకు సాగాలి: ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 25) : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎస్ఐసీ)ను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి అధ్యక్షతన, డి. రాజు కన్వీనర్‌గా కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఐడియా జనరేషన్, ఇన్నోవేషన్ ఛాలెంజ్, ప్రాజెక్ట్ మేకింగ్ తదితర అంశాల్లో శిక్షణ అందించనున్నారు. బాలాజీ ఇంజినీరింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి. శ్రీధర్ విద్యార్థులకు స్టార్టప్‌లు, సాంకేతిక పరిష్కారాలపై మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇన్నోవేషన్ అంబాసిడర్లుగా ఉపాధ్యాయులు పి. సదాకర్ రెడ్డి, ఎ. రవికుమార్, సిహెచ్. రాజేంద్ర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థి ప్రతినిధులుగా పాఠశాల కెప్టెన్ సిరి, హెడ్ బాయ్ సాత్విక్, హెడ్ గర్ల్ శ్రీవర్ష ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని పాఠశాల నిర్వాహకులు ఆకాంక్షించారు.





విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలి

రహీంఖాన్‌పేటలో ఇబ్బందులు తొలగించాలి వార్డు సభ్యులు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 25) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా తదితర సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 8వ వార్డు సభ్యులు కుశల అంజయ్య, కుస నరేష్, వరాల రాజు, ఏనుగుల శ్రీనివాస్, సింగరి వెంకటేష్ వినతిపత్రం అందజేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

కలంజ్యోతి, బ్యూరో : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం 2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణలో రైతులు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



సిగ్మా.. ఐటమ్ సాంగ్ రిలీజ్

సందీప్ కిషన్ హీరోగా, ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా నటించిన చిత్రం సిగ్మా. ఈ మూవీలో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన సినిమా గాంధీ జయంతి రోజున థియేటర్లలో సందడి చేయనుంది. ఇటీవలే సిగ్మా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. తాజాగా ఈ మూవీ నుంచి సులోచన అంటూ సాగే క్రేజీ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. శృతి రంజని ఆలపించారు. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ తమన్ సంగీతమందించారు. .

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక